# ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్ ● మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం సందర్శన


దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్, జూన్ 21 : ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్యాలయాన్ని కమిషనర్ మారుతీ ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ తీరును పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అందుతున్న సేవలను కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. త్వరలో డంప్ యార్డు సమస్య పరిష్కరిస్తామన్నారు. బయోమైనింగ్ ప్రక్రియ ప్రారంభమైందా అని అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య నిర్వహణ తీరును అడిగి తెలుసుకున్నారు. సీజన్‌లో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వీధికుక్కలను జంతుసంరక్షణ కేంద్రానికి తరలించాలన్నారు. మిషన్ భగీరథ, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 22 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


శ్రీరాంపూర్ ఆర్కే-7గనిపై ఆందోళన చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



# మిల్లులకు ఫుల్ కరెంట్

**కేసీఆర్ సర్కార్‌లో నిరంతరాయంగా సరఫరా**

- స్వరాష్ట్రంలో పెరిగిన మిల్లుల సంఖ్య
- 2014కి ముందు 8 నుంచి 10 గంటలే కరెంట్
- వెలుగులు నింపిన కేసీఆర్‌పై నిందలు సరికాదంటున్న యజమానులు

మంచిర్యాల, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పదేళ్ల కేసీఆర్ పాలనలో పారిశ్రామికీకరణ పరుగందుకున్నది. అందుకు ప్రభుత్వం తెచ్చిన నూతన విధానాలే కాదు, నాణ్యమైన కరెంట్ కూడా ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఉమ్మడి రాష్ట్రంలో పవర్‌హాలీడేలు, మరెన్నో ఆంక్షల మధ్యన మిల్లులు మూతపడే పరిస్థితి దాపురించగా, స్వరాష్ట్రం వచ్చిన తర్వాత వాటి సంఖ్య రెట్టింపు అయ్యింది.

### తెలంగాణ రాకముందు నరకయాతన

తెలంగాణ రాక ముందు కరెంట్ కోసం మిల్లుల యజమానులు నరకయాతన పడ్డారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని గందరగోళ పరిస్థితి ఉండేది. వారానికో తీరు షెడ్యూల్ అమలు చేసేవాళ్లు. ఆ షెడ్యూల్ ప్రకారంగానైనా కరెంట్ ఇచ్చేవాళ్లు కాదు. ఈ కారణంగా పరిశ్రమల నిర్వాహకులు తీవ్ర నష్టాలను చవిచూసేవాళ్లు. రాత్రి సమయంలో 8 గంటలు నుంచి 10 గంటలే కరెంట్ ఇచ్చేటోళ్లు. సాయత్రం పని మొదలైతే తెల్లవారు జాము దాకా చేసేటోళ్లు. హమాలీలు రాత్రంతా పని చేసి పొద్దంతా పడుకునేటోళ్లు. ఒళ్లంతా పుండు చేసుకొని ఆరోగ్యం పాడు చేసుకునేటోళ్లు. కేసీఆర్ సీఎం అయ్యాక ఆ పరిస్థితి పోయింది. మిల్లులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇచ్చారు. ఎప్పుడంటే అప్పుడు ధాన్యం పట్టించుకునే రోజులు వచ్చినయ్. గతంతో పోలిస్తే కేసీఆర్ హయాంలోనే మాకు మంచిరోజులు వచ్చినయని యజమానులు చెబుతున్నారు. 24 గంటల కరెంట్‌తో గడిచిన పదేళ్లలో మిల్లుల సంఖ్య పెరిగిందని, అలాంటి కేసీఆర్‌ను కరెంట్ ఏడ కొన్నరు.. ఎందుకు కొన్నరు.. అని ప్రశ్నించడం సరికాదని మండిపడుతున్నారు. కాంగెసోళ్లు ఇచ్చేది ఉండదు.. సచ్చేది ఉండదు కానీ అక్కరకు రాని పనులు చేస్తారని చెబుతున్నారు. కేసీఆర్ 24 గంటల కరెంట్ మీద తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

### కోతలు లేని కరెంట్‌కు శ్రీకారం చుట్టింది కేసీఆరే



*చెన్నూర్ రూరల్, జూన్ 21 : నేను చాలా ఏళ్లుగా రైస్ మిల్లు నిర్వహిస్తున్న. 2014 కంటే ముందు ఇష్టం వచ్చినట్లు కరెంట్ కోతలు పెట్టేటోళ్లు. గ్రామీణ ప్రాంతాల్లో పగలు ఒకవారం 8 గంటలు కోత, మరొక వారం రాత్రి 6 గంటల కోతలు విధించేటోళ్లు. తెలంగాణ రాష్ట్రం వచ్చి.. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత విద్యుత్ సరఫరాలో చాలా మార్పు వచ్చింది. అటు రైతులు, ఇటు గృహ అవసరా లకేగాక పరిశ్రమలకూ నిరంతరంగా మెరుగైన విద్యుత్ అందించారు. కోతలు లేని కరెంట్‌కు శ్రీకారం చుట్టింది కేసీఆర్ ఘనతే.*

**- కాళేశ్వరం సాగర్ గౌడ్, రైస్ మిల్లు యాజమాని, చెన్నూర్**

### కరెంట్ కోతలతో నష్టాల పాలవుతున్నాం



*భైంసాటౌన్, జూన్, 21 : నేను చాలా కాలం నుంచి రైస్‌మిల్ నడుపుతున్నా. 2014కు ముందు కరెంట్ కష్టాలు అనుభవించాం. 2014 తర్వాత కేసీఆర్ పాలనలో నిరంతర నాణ్యమైన కరెంటు అందివ్వడంతో సుఖంగా జీవించాం. ఇప్పుడు వేళాపాలా లేకుండా కరెంట్ కోతలు విధిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. కరెంట్ కోతలతో చాలా సార్లు మిల్లింగ్ ఆపేయాల్సి వస్తున్నది. మిల్లింగ్ జరిగినా, జరగకపోయినా వారు మాట్లాడుకున్నంత కూలీలకు కూలి ఇవ్వాల్సిందే. దీంతో ఖర్చులు పెరగడంతో పాటు లాభాలు లేక నష్టపోతున్నాం. గతంలో నిరంతర, నాణ్యమైన విద్యుత్‌ను అందించేవారు.*

**-రూపేశ్, శ్రీ రాజరాజేశ్వర రైస్‌మిల్, వానల్‌పాడ్**

### పదేండ్లు కరెంట్ కోతలు లేవు



*భైంసాటౌన్, జూన్, 21 : తెలంగాణ రాష్ట్రం రాకముందు కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. ఇప్పుడు ఎప్పుడు పడితే అప్పుడు కరెంట్ కోతలు విధిస్తున్నారు. ఒక్కోసారి లోవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. పరిశ్రమల రంగానికి కోతలు లేకుండా కరెంట్ ఇచ్చారు. ఎన్నికల సమయంలో 24 గంటల కరెంట్ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఇష్టానుసారం కోతలు విధిస్తున్నది. దీంతో పరిశ్రమలు నడిపడం కష్టంగా మారింది. ఇప్పటికైనా గత ప్రభుత్వం మాదిరిగా నాణ్యతతో కూడిన నిరంతర విద్యుత్‌ను అందిస్తారని ఆశిస్తున్నాం.*

**-మహేశ్, సిద్ధేశ్వర రైస్‌మిల్, సుంక్లి**

# బొగ్గు గనుల ప్రైవేటీకరణపై భగ్గు

## వేలంపై కార్మికులు, నాయకుల కన్నెర్ర

- బీజేపీ సర్కారు వైఖరి సరికాదంటూ ఆగ్రహం ● గనులపై ధర్నాలు.. నల్లబ్యాడ్జీలతో నిరసనలు
- కేంద్రం దిష్టిబొమ్మల దహనం ● సమ్మెకు సిద్ధమవుతున్న కార్మికలోకం


కాసిపేట : కాసిపేట గనిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

> *సింగరేణి బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణకు వేలం వేయడంపై కార్మికులు, ఆయా సంఘాల నాయకులు కన్నెర్ర చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న బొగ్గు గనులపై ఆందోళనలు చేపట్టారు. ధర్నాలు నిర్వహించి.. నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. సింగరేణి జోలికొస్తే ఊరుకునేది లేదని, కేంద్రం తగ్గకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.*
> **- మంచిర్యాల, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**


శ్రీరాంపూర్ జీఎంకు గనుల వేలంలో సింగరేణి పాల్గొనద్దని వినతి పత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, జూన్ 21 : శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై టీబీజీకేఎస్ నాయకులు రాజు నాయక్, బిరుదు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గనులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. బీజేపీ సర్కారు పదేళ్లుగా సింగరేణి గనులను వేలం వేయాలని కుట్రలు చేస్తే కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకుందని గుర్తు చేశారు. అలాగే సింగరేణి సంస్థకే గనులు కేటాయించాలని డిమండ్ చేస్తూ శుక్రవారం శ్రీరాంపూర్‌లో జీఎం ఆఫీస్ ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేశారు. ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొంరయ్య ఆధ్వర్యంలో జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన 10 రోజుల్లోనే సింగరేణి గనులను ప్రైవేట్‌పరం చేయడానికి వేలం నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమాల్లో నాయకులు సారయ్య, లక్ష్మణ్, మోతె లచ్చన్న, రాజయ్య, రాంచందర్, వేణు, రాజేందర్, రేగుల శ్రావణ్, ప్రతాప్, రాజు, వంశీకృష్ణ, సునీల్‌కుమార్, రవీందర్ ఉన్నారు. శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్, ఆర్కే-7 గనులపై ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ నాయకులు ఆందోళనలు చేశారు. ఆర్కే-7పై ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, టీబీజీకేఎస్ నాయకులు రాజూనాయక్, సీఐటీయూ పిట్ కార్యదర్శి పెరుక సదానందం, డివిజన్ ఆర్గనైజర్ కస్తూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణికి గనులు ఇవ్వకుండా జాప్యం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా కార్యదర్శి వెంగళ కుమారస్వామి, పిట్ కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు తిరుపతి, భూపతి, అశోక్, వెంకన్న, పేరం రమేశ్, ప్రేమ్‌కుమార్, సీఐటీయూ నాయకులు సందీప్, ప్రతాప్, ప్రణయ్ పాల్గొన్నారు.

మందమర్రి, జూన్ 21 : మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాలపై శుక్రవారం ఏఐటీయూసీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గనులు, విభాగాల అధికారులకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 60 బొగ్గు గనులను టెండర్ ప్రక్రియ ద్వారా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నిందన్నారు. అందులో భాగంగా సింగరేణిలో పలు గనులను కూడా ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకు సిద్ధమవుతుందని మండిపడ్డారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఇప్పటికైనా టెండర్ ప్రక్రియను విరమించి తెలంగాణకు గుండెకాయలాంటి సింగరేణి సంస్థను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో అన్ని సంఘాలను కలుపుకుని సమ్మెకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, కేకే ఓసీ మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, గాండ్ల సంపత్, రాంచందర్, భూమయ్య, ఊదరి శ్రీకాంత్, పారిపెల్లి రాజేశం, రాజశేఖర్, రాజయ్య, కుమార్ ఉన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే-5గని వద్ద ఐక్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్‌ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య మాట్లాడుతూ 139 ఏండ్ల చరిత్ర కలిగిన సింగరేణిని టెండర్ల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గని వద్దకు వచ్చిన ఐక్య కార్మిక సంఘాల నాయకులను గని మేనేజర్ అల్లావుద్దీన్ అడ్డుకున్నారు. అయినా సంఘాల నాయకులు గని ముఖ ద్వారం వద్ద నిరసన తెలిపారు. గని మేనేజర్ కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ నిర్ణయానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై సీఎండీ బలరాం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ నాయకులు పార్వతి రాజిరెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ నాయకులు కృష్ణ, జాఫర్, బ్రహ్మానందం, రామన్న పాల్గొన్నారు.

కాసిపేట, జూన్ 21 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బొగ్గు గనులను ప్రైవేట్‌పరం చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొప్పరి శ్రీహరి, రాజన్న, రాజేందర్, ఆడెపు రవీందర్, కే సంతోష్ పాల్గొన్నారు.

### సమ్మెకు సిద్ధమవుతున్న కార్మికలోకం

హైదరాబాద్ వేదికగా దేశవ్యాప్తంగా 60 బొగ్గు గనులను వేలం వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించగా, కార్మికలోకం సమ్మెకు సిద్ధమవుతున్నది. సంస్థలో 20 వేల మంది 35 నుంచి 45 యేళ్లు ఉన్న వారున్నారు. కంపెనీ వేలంలో పాల్గొని బావులు రాక ప్రైవేట్‌కు వెళ్తే.. ఉన్న బావులు అయిపోయాక ఈ 20 వేల మంది భవిష్యత్తు ఏమిటనే ఆందోళన వ్యక్తమవుతున్నది. బొగ్గు గనుల వేలానికి వ్యతిరేకంగా దశలవారీగా నిరసనలు వ్యక్తం చేస్తామని, అప్పటికీ మార్పు రాకపోతే సమ్మె తప్పదని హెచ్చరిస్తున్నారు.

### పోరాటం చేస్తాం



*సింగరేణిని కాపాడుకోవాలంటే వేలాన్ని అడ్డుకోవాలి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేడు మీటింగ్‌కు పిలిచారు. ఆయనతో మాట్లాడాక ఈ విషయంపై కార్యాచరణ ప్రకటిస్తాం. జేఏసీతో కలిసి పనిచేయడమా.. ఒంటరిగా వెళ్లడమా అనేది నిర్ణయం తీసుకుంటాం. బొగ్గుగనుల వేలాన్ని ఆది నుంచి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ, టీబీజీకేఎస్ వ్యతిరేకిస్తూ వచ్చాయి. గతంలో ప్రధానమంత్రి మోదీకి అనేక లేఖలు రాశాం. కార్మికుల పక్షాన నిలబడి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేశాం. ఇప్పుడు అదే చేస్తాం. కార్మికులు అధైర్య పడొద్దు. దశలవారీ కార్యచరణను కేటీఆర్‌తో మీటింగ్ అయ్యాక ప్రకటిస్తాం. కార్మికలోకం కలిసి రావాలని కోరుతున్నాం.* **- రాజిరెడ్డి, టీబీజీకేఎస్ నాయకులు**


మందమర్రి కేకే-5 గనిపై దిష్టిబొమ్మతో హెచ్‌ఎంఎస్ నాయకుల నిరసన


శ్రీరాంపూర్ ఆర్కే- 7గనిపై ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

# దశాబ్దాలుగా సాగు చేస్తున్నా అభద్రతే..

- పోడు భూములను స్వాధీనం చేసుకునేందుకు అధికారుల యత్నం ● ఇటిక్యాల్‌పాడ్ గ్రామస్తుల్లో ఆందోళన
- సీఎంను కలిసేందుకు వెళ్లిన రైతులు ● మంత్రి సీతక్క ఆదేశించినా పట్టించుకోని వైనం

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ సిర్పూర్-టీ, జూన్ 21 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టీ) మండలం ఇటిక్యాల్‌పాడ్‌కు చెందిన ఆదివాసులు ఐదు దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేసుకుంటుండగా, అటవీ అధికారుల తీరుతో అభద్రత వెంటాడుతున్నది. ఇప్పటికే కొన్ని భూములు లాగేసుకోగా, మిగతా రైతులను నిత్యం వేధింపులకు గురి చేయడం ఆందోళన కలిగిస్తున్నది.


ఇటిక్యాల్‌పాడ్ గ్రామం

### 1500 ఎకరాలు సాగు..

సిర్పూర్(టీ) మండలం ఇటిక్యాల్‌పాడ్‌కు చెందిన సుమారు 100 కుటుంబాలకు చెందిన రైతులు గ్రామ శివారులోని 1500 ఎకరాలు సాగుచేసుకుంటున్నారు. ఇప్పటికే గతంలో దాదాపు 250 హెక్టార్ల భూములను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం 600 నుంచి 700 ఎకరాల వరకు సాగు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో రైతులు సాగుచేస్తున్న భూములు అడవికి చెందినవని, వీటిని అటవీ శాఖకు తిరిగి ఇవ్వాలని అధికారులు కొద్ది నెలలుగా సంప్రదింపుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారు. అధికారుల వేధింపులపై స్థానిక ఎమ్మెల్యేను కలిసినా ప్రయోజనం లేకపోవడంతో ఇక చేసేదేమిలేక కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, రైతులు శుక్రవారం తెల్లవారు జామున సీఎంను కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లారు. ఒకవేళ అటవీ అధికారులు తమ భూములను స్వాధీనం చేసుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని, పెంచికల్‌పేట్ మండలం కొండపల్లికి చెందిన పోడు రైతుల తరహాలో తిరుగుబాటు చేస్తామని వారు హెచ్చరించారు. కాగా, పోడు భూముల సాగు చేసుకుంటున్న రైతుల జోలికి వెళ్లొద్దని ఇటీవల నిర్వహించిన జడ్పీ సమీక్షలో స్వయంగా మంత్రి సీతక్క ఆదేశించనప్పటికీ అటవీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే పెంచికల్‌పేట మండలం కొండపల్లి, ఆసిఫాబాద్ మండలంలోని దానాపూర్ గ్రామాల్లో అటవీ అధికారులు భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా, పోడు రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత, తిరుగుబాటు వ్యక్తమైంది.

### ఐదెకరాలు లాగేసుకున్నారు



*మా ఊరిలో దాదాపు 40 ఏళ్లుగా 5 ఎకరాల భూమిని సాగుచేసుకుంటున్న. మా కుటుంబానికి ఈ భూమే ఆధారం. ఇన్నేండ్లుగా లేనిది ఈ యేడాది అటవీ అధికారులు వచ్చి నేను సాగుచేసుకుంటున్న భూమిని లాగేసుకున్నారు. ఐదెకరాల్లో ఎకరం కూడా ఇవ్వలేదు. ఇప్పుడు మాకు ఉపాధి లేకుండా పోయింది. కూలీ పనికి వెళ్లాల్సి వస్తోంది. 40 ఏళ్లుగా గుర్తుకురాని అటవీ భూమి ఇప్పుడే ఎందుకు గుర్తుకు వచ్చింది.*

**- చటరే మల్లయ్య, ఇటిక్యాల్‌పాడ్**

### ఎకరం కూడా ఇవ్వలేదు...



*నాకు ఊహతెలిసినప్పటికి నుంచి మా నాన్న 8 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నడు. అదే భూమిలో ఇప్పుడు నేను కూడా సాగు చేస్తున్న. కొన్ని నెలల క్రితం మా గ్రామానికి వచ్చిన అటవీ అధికారులు నేను సాగుచేసుకుంటున్న 8 ఎకరాలను లాగేసుకున్నారు. ఎంత బతిమిలాడినా ఎకరం కూడా ఇవ్వలేదు. నేను ఇంతకాలం సాగుచేసుకునే భూమిలో అటవీ అధికారులు మొక్కలను నాటారు. మా గ్రామంలోని మిగతా రైతుల భూములు కూడా తీసుకుంటరట.*

**- నివురే సురేశ్, ఇటిక్యాల్‌పాడ్**

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679